క్లుప్తంగా

యాజమాన్య పద్ధతులతో సాగు లాభదాయకం

మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక



ముసునూరు: ఉద్యాన పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగు లాభదాయకమని మండల ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక అన్నారు. చెక్కపల్లిలో బుధవారం ఉద్యాన, వ్యవసాయ శాఖలు, గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్ పామ్, కోకో పంటల్లో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆగ్రోవెట్ శాస్త్రవేత్తలు సాంబశివరావు, సురేష్ శ్రీసంజయ్ మండలంలో సాగవుతున్న ఆయిల్ పామ్, కోకో పంటలపై జాగ్రత్తలు, నాటిన సమయం నుంచి పంట కోత సమయం వరకు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణ, అధిక దిగుబడుల సాధన, పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. పంట నష్టం వాటిల్లితే ఆయా గ్రామ రైతు సేవా కేంద్రాల్లో వివరాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, చెక్కపల్లి, లోపూడి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని చొప్పరమెట్ల రోడ్డులో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. బుధవారం డెప్యూటీ ఎంపీడీఓ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది డోజర్ సహాయంతో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు.

నిత్యానందకరి.. నమోస్తుతే

ఇబ్రహీంపట్నం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గమ్మను కొంగు బంగారంగా భావించిన భక్తులు పాడిపంటలు సమృద్ధిగా పండేలా ఆశీస్సులు అందించాలని పూజలు చేశారు. కొండపల్లి మార్కెట్ సెంటర్‌లోని దుర్గాసాధిని మాత ఆలయంలో దుర్గమ్మ అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. మూలపాడు విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో కొలువుతీరిన అమ్మవారు మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సర్వ జీవరాశులకు అన్నం ప్రసాదించే అన్నపూర్ణాదేవిని దర్శించుకుంటే ఆకలిదప్పికలు ఉండవన్నారు. సాక్షాత్తు పరమేశ్వరుడికి భిక్ష పెట్టిన అన్నపూర్ణాదేవిని పూజిస్తే ధన, ధాన్య వృద్ధి, ఐశ్వర్య సిద్ధి కలుగుతుందని అర్చకులు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి పూజలు

తిరువూరు: తిరువూరు పట్టణంలోని గౌరీ కేదారేశ్వరస్వామి ఆలయం, శ్రీఅష్టలక్ష్మీ దేవస్థానం, శ్రీరామలింగేశ్వరాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, పాత శివాలయం, షిర్డీసాయి, సత్యసాయి మందిరాల్లో, కూరగాయల మార్కెట్లో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గంపలగూడెం మండలంలోని పెనుగొలను, ఊటుకూరు, గంపలగూడెం, గోసవీడు గ్రామాల్లోని దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధైర్యలక్ష్మీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఎ.కొండూరు మండలంలోని కంభంపాడు, చీమలపాడు, గోపాలపురం గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



చనుబండలోని అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



గంపలగూడెం మండలం నెమలి దేవస్థానంలో పూజలు



- **మైలవరం:** తిరువూరు రోడ్డులోని శ్రీ రేణుకా దేవి, పాండురంగ స్వామి ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- **జి.కొండూరు:** కవులూరులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని మూడో రోజు బుధవారం అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. అమ్మవారి వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమాలకు గ్రామస్తులు పెద్దఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.
- **చాట్రాయి:** దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కనకదుర్గ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- **జి.కొండూరు:** జి.కొండూరు బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని అన్నపూర్ణా దేవిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.
- **బలివే(ముసునూరు):** బలివేలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని ఉప ఆలయం రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. లోపూడిలోని కోదండ రామాలయం, గోపవరం నాగేంద్రపురం సెంటర్ల వద్ద మండపాల్లో అన్నపూర్ణాదేవిగా అలంకరించి మహిళలు, భవానీ మాలాధారులు పూజలు చేశారు.
- **విస్సన్నపేట:** స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని బుధవారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- **నూజివీడు:** పట్టణంలోని కోట మహిషాసురమర్దనీ అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అఖండ దీపారాధన, కుంకుమార్చన, శ్రీచక్రార్చన నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ ఈఓ అలివేణి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాతపేట జ్ఞాన సరస్వతీ దేవాలయం, జంక్షన్ రోడ్డులోని జ్ఞాన సరస్వతీ దేవాలయం, 32వ వార్డులోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పాతపేటలోని జ్ఞాన సరస్వతీ దేవాలయంలో అమ్మవారికి ఉదయమే పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. కోనేరుపేటలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద కనకదుర్గమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొండపల్లి మార్కెట్ సెంటర్‌లో అమ్మవారు



జి.కొండూరు బీసీ కాలనీలో అలంకరణ



మైలవరంలో అన్నపూర్ణాదేవిగా..





విస్సన్నపేటలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు ; బలివేలో అన్నపూర్ణగా అమ్మవారు





గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి జోగి రమేష్, వైఎస్సార్‌సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామి దాసు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

క్యాన్సర్ బయాలజీపై సెమినార్

మైలవరం: క్యాన్సర్ బయాలజీపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని డాక్టర్ ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపురంశెట్టి రంగారావు అన్నారు. క్యాన్సర్ బయాలజీపై ఒక రోజు సెమినార్ కార్యక్రమం మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ ప్రొఫెసర్ రాయల సురేష్‌కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ బయాలజీ కారణాలు, నిర్మూలన అంశాలను విద్యార్థులకు వివరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వృక్ష శాస్త్ర డిపార్ట్‌మెంట్ డాక్టర్ వడివేలు మురుగన్ మాట్లాడారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ జె. రాముడు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధన సైంటిస్టులు పాల్గొన్నారు.

జేవీవీ మండల కమిటీ ఎన్నిక

తిరువూరు: జన విజ్ఞాన వేదిక గంపలగూడెం మండల నూతన కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. గీతాంజలి ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మండల మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి. ఏడుకొండలు, బి. సైదులు, సహాయ కార్యదర్శులుగా కె. శేషగిరి, పి. రమేష్, కోశాధికారిగా పి. కృష్ణయ్య, గౌరవాధ్యక్షులుగా మల్లికార్జునరావు, వై. వెంకటరెడ్డి, సమతా విభాగ కన్వీనర్‌గా జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా కార్యదర్శి రాంప్రదీప్ తెలిపారు.

రేపు జాబ్ మేళా

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ మస్తాన్ వలి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కంపెనీల హెచ్‌ఆర్ మేనేజర్లు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. నిరక్షరాస్యుల నుంచి డిగ్రీ, పీజీ చదివిన విద్యార్థులు హాజరు కావచ్చని చెప్పారు. ఉద్యోగం స్థాయిని బట్టి వేతనం రూ.30 వేల వరకు ఉంటుదన్నారు. కళాశాల ప్రాంగణంలో ఆరోజు ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్: 82477 66718, 63019 90597 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గ్రామీణాభివృద్ధికి యాక్షన్ ప్లాన్

నూజివీడు: గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థల బలోపేతానికి రాష్ట్ర గ్రామీణ శ్రేయస్సు అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కీలకమైన వేదికని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. నూజివీడులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్‌జీఎస్‌ఏ యాక్షన్ ప్లాన్‌పై రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీకి తగిన యాక్షన్ ప్లాన్ రూపొందించడం ద్వారా స్థానిక అవసరాలను తీర్చుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా పంచాయతీల స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో కార్యాచరణ ప్రణాళిక తయారు చేయడం వలన అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. డీడీఓ కె.వెంకటరత్నం, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మహిళలు ప్రాధాన్యత ఇవ్వాలి

డాక్టర్ ప్రియాంక

మైలవరం: మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబాలు, సమాజం ఆరోగ్యంగా ఉంటుందని, కనుక మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. మైలవరంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 2, 4 గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మహిళలు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భాశయ ముఖ ద్వార స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. మైలవరం సర్పంచ్ మంజుభార్గవి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సీహెచ్ ప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుట్రేల(విస్సన్నపేట): పుట్రేల పంచాయతీ రామానగరం గ్రామ సచివాలయం వద్ద మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తెల్లదేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు, సర్పంచ్ కారుమంచి స్వాతి పాల్గొన్నారు.

- **చాట్రాయి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ సేవలు మహిళలు వినియోగించుకోవాలని చాట్రాయి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బూరుగుగూడెం సచివాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చాట్రాయి: వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి బి.శివశంకర్ అన్నారు. మర్లపాలెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిలో రసం పీల్చే పురుగు, కాండం తొలిచే పురుగు నివారణకు ప్రకృతి వ్యవసాయంలో అందించే అగ్ని అస్త్రాన్ని స్ప్రే చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తక్కువ ఖర్చుతో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. అనంతరం అగ్ని అస్త్రం తయారు చేసే విధానాన్ని వివరించారు. ఉప సర్పంచ్ రాజా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



అగ్ని అస్త్రం తయారు చేస్తున్న సిబ్బంది

రేపు అఖిలపక్షం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

తిరువూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నూతన వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం తిరువూరులో జరిగిన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేకల నాగేంద్ర ప్రసాద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న తిరువూరులో ఫ్యాక్టరీ సెంటర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించనున్నట్లు నాయకులు తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, ఉప్పలపాటి లక్ష్మీదాసు, బొడ్డు ప్రకాశరావు, బాలు, వైఎస్సార్ సీపీ నాయకులు పరసా శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు నాగుల్‌మీరా, మాలపాటి ఉదయ్, సీపీఎం నాయకులు ఎస్. నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం, ఎస్‌వీ భద్రం, ఆకుల రవి, బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని ఐక్య పోరాటం



నూజివీడు: నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని చేసే పోరాటంలో ఎవరు కలిసి వచ్చినా వారితో కలిసి ముందుకు సాగుతామని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ అన్నారు. నూజివీడు కోర్టు భవనాల ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపే వరకు తమ పోరాటం సాగుతుందన్నారు. దీనిపై మంత్రి కొలుసు పార్థసారథి ఆహ్వానం మేరకు ఆయనను కలవగా రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అపాయింట్‌మెంట్ ఇప్పిస్తామని చెప్పారన్నారు. నియోజకవర్గంలోని అన్నివర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, వర్తక సంఘాలు, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్లు అందరూ కలిసి రావాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, కార్యదర్శి వై.హరిబాబు, సీనియర్ న్యాయవాదులు వైఎస్ దొరై, రమాకుమారి, ఎస్‌కేడీ ప్రసాద్, పలగాని రాంబాబు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల ఆర్థికాభివృద్ధికి లోక్ కల్యాణ్ మేళా

నూజివీడు: వీధి విక్రయదారులకు రుణ పరిమితిని పెంచి ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. పట్టణంలోని షాదీఖానాలో బుధవారం వీధి విక్రయదారులకు లోక్ కల్యాణ్ మేళాను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తొలిసారి రుణాన్ని రూ.15 వేలు, రెండోసారికి రూ.25 వేలు, మూడో సారి రూ.50 వేల వరకు స్వానిధి పథకం కింద వీధి విక్రయదారులకు ఇస్తారని వివరించారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.మాధవి, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, ఎల్‌డీఎం నీలాద్రి, జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- **ఇబ్రహీంపట్నం:** కేంద్ర ప్రభుత్వం చిరువ్యాపారుల కోసం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి స్వానిధి పథకం (లోక్ కల్యాణ్ మేళా) సద్వినియోగం చేసుకోవాలని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు బుధవారం మూడో సచివాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈపథకం చిరువ్యాపారులకు ఆర్థికపరంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

పని గంటల పెంపుపై నిరసన

నూజివీడు: కార్పొరేట్ సంస్థలు, బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా ఉన్న పని గంటల పెంపును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు డిమాండ్ చేశారు. పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ పట్టణంలో బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పుల్లారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుళ జాతి సంస్థలకు తొత్తులుగా పనిచేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. రాత్రి వేళల్లో మహిళలు పని చేయాలని సీఎం చంద్రబాబు చెప్పటం సిగ్గుచేటన్నారు. కార్మికులు బలరాం, వరప్రసాద్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

బలివే(ముసునూరు): బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ సభ్యులు 11 మంది బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ బొమ్మకంటి శ్యామలరావుతో దేవదాయ శాఖ గన్నవరం డివిజన్ తనిఖీదారు కేవీ అనూరాధ ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా ఎస్.వెంకటసాయికృష్ణ, గొల్ల గుర్నాథం, గుడివాడ వెంకటేశ్వరరావు, జి.కనకమ్మ, ఎ.మల్లిక, ఎన్.నాగదుర్గ, డి.పద్మావతి, కె. అన్నవరం, పి.నాగేశ్వరరావు, ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఆలయ అర్చకులు తోలేటి అరుణ భాస్కరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ట్రస్ట్ బోర్డు సభ్యులను అధికారులు, కూటమి నేతలు అభినందించారు.

పీఎంవీవైపై శిక్షణ

చాట్రాయి: ప్రధానమంత్రి మాతృ వందన యోజనను సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు ఐసీడీఎస్ సీడీపీఓ పి.విజయకుమారి అన్నారు. బుధవారం చాట్రాయి వెలుగు కార్యాలయంలో పీఎంవీవై పథకంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తమ పరిధిలో పీఎంవీవై పథకంలో అర్హులైన గర్భిణులను నమోదు చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి, వెలుగు ఏపీఎం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.